క్లుప్తంగా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర: ఈనెల 30న తొర్రూరు జూనియర్ సివిల్ కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై పిల్లల రాజు తెలిపారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్‌లో కేసుల సత్వరం పరిష్కారం ఉంటుందన్నారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు, ప్రమాదాలు, ఇతర కేసులను లోక్ అదాలత్‌తో పరిష్కరించుకోవచ్చన్నారు.

రేపటినుంచి గ్రామ సభలు

మహబూబాబాద్ రూరల్: గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించేందుకుగాను ఈనెల 28వ తేదీ గురువారం నుంచి గ్రామసభలు నిర్వహిస్తారని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపాడు. జనవరి 6వ తేదీ వరకు మహబూబాబాద్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. మండలస్థాయి ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు గ్రామసభల్లో పాల్గొనాలని కోరారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు మంగళవారం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, వైస్ ఎంపీపీ కట్టిబోయిన శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాంపురం సర్పంచ్ తారాబాయి, సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, పిచ్చయ్య, జనార్దన్, వెంకటేష్, రమేష్, నాగేష్, లోకేష్ ఉన్నారు.

సెన్సార్ బోర్డు ప్యానల్ సభ్యుడిగా సందీప్



మహబూబాబాద్ అర్బన్: సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు ప్యానల్ సభ్యుడిగా మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన పల్లె సందీప్ గౌడ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఒద్దిరాజు రామచందర్ రావు మంగళవారం తెలిపాడు.


10 క్వింటాళ్ల నల్లబెల్లం సీజ్

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న 10క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటిక బెల్లం సీజ్ చేసిన సంఘటన మండలంలోని వస్రాం తండాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం వస్రాం తండాకు చెందిన గుగులోతు పద్మ, రవి అక్రమంగా నల్లబెల్లం తరలిస్తుండగా పట్టుకుని నల్లబెల్లం, పటిక బెల్లాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు. కాగా మండలంలోని మునిగలవీడు, బ్రాహ్మణకొత్తపల్లి గ్రామాల శివారు ఆకేరు వాగునుంచి అక్రమంగా తరలిస్తున్న 8 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపాడు.

మెడికల్ బిల్లులు చెల్లించాలి

మహబూబాబాద్ అర్బన్: తనకు రావాల్సిన మెడికల్ బిల్లులను ట్రెజరీకి పంపించి వెంటనే చెల్లించాలని పంచాయతీరాజ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ టి.రఘురామయ్య కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ కాగా వైద్యుల సూచన మేరకు మందులు వాడుతున్నామని తెలిపాడు. మెడికల్‌కు సంబంధించిన బిల్లులు కార్యాలయంలో అందజేసినప్పటికీ ట్రెజరీకి పంపించలేదని, ఇప్పటికైనా పంపించి మంజూరు చేయాలని ఆయన కోరారు.

'శ్రీదత్త పౌర్ణమి' వేడుకలు



మహబూబాబాద్ రూరల్: శ్రీదత్త పౌర్ణమి పూజా వేడుకలను జిల్లా కేంద్రంలోని శ్రీసాయి మందిరంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ముడుంబై మంగాచార్యులు, సహా అర్చకుడు రామానుజాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు వందనం కమల్, కార్యదర్శి ఇమ్మడి చంద్రప్రకాశ్, కోశాధికారి బొడ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీదత్త పౌర్ణమి వేడుకలు జరిగాయి. 201 కలశాలతో కలశపూజ చేసి, దత్తాత్రేయుడికి అభిషేకం పూజలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఉమ దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో రాజగోపాలం, విద్యాసాగర్, వాణి, వెంకటయ్య, సుందర్‌గుప్తా, నారాయణరావు, రవీంద్రగుప్తా, శివకుమార్, కౌన్సిలర్ గోపిరత్నం పాల్గొన్నారు. అన్నప్రసాద దాతలుగా కొడుమూరి శివకుమార్, స్వర్ణలత, వరుణ్ సాయి, అద్వైత తార వ్యవహరించారు.

దత్త జయంతి

గార్ల: గార్లలోని సాయిబాబా మందిరంలో దత్త జయంతి సందర్భంగా శ్రీరామనామ భజన మండలి బృందం సభ్యులు 41 పర్యాయాలు హనుమాన్ చాలీసా, సాయి చాలీసా పారాయణం పఠించారు. కార్యక్రమంలో పూజారి సుదర్శన్‌రావు, రమేష్‌బాబు, పాండు రంగారావు, ఉపేందర్, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ అయ్యేనా?

- బాలల పరిరక్షణ విభాగంలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల ఎదురుచూపులు
- ఏళ్లుగా ఆందోళన చేస్తున్న ఉద్యోగులు
- గత ప్రభుత్వ హయాంలో హామీ
- కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేనా?



మంత్రి సీతక్కను కలిసిన యూనియన్ నాయకులు (ఫైల్)

మహబూబాబాద్: మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని బాలల పరిరక్షణ విభాగంలో ప్రతి జిల్లాలో కాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా రెగ్యులరైజ్ చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. పలు రాష్ట్రాలలో అమలు చేయగా దాని ప్రాతిపదికన పర్మనెంట్ చేయాలని గత ప్రభుత్వంలో మంత్రులను కలిసి విన్నవించగా హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు చెబుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాగా, ఆ హామీని అమలుచేస్తుందా అనే అనుమానంతో ఉన్నారు. కాగా సంబంధిత శాఖ మంత్రి సీతక్కను కలిసి పలు సమస్యలతోపాటు రెగ్యులరైజ్ చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

ప్రతి జిల్లాలో 12 మంది చొప్పున కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగాలను భర్తీ చేసింది. డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీఓ), చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఐసీ), చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఎన్ఐసీ), లీగల్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషల్ వర్కర్లు ఇద్దరు (పురుష, మహిళ), అవుట్ రీచ్ వర్కర్లు ఇద్దరు (పురుష, మహిళ), డీఓ (డాటా ఎంట్రీ ఆపరేటర్), అకౌంటెంట్ ఉద్యోగాలను భర్తీ చేసింది. డీసీపీఓకు వేతనం రూ.43,000, సీపీఓలకు రూ 27,500, కౌన్సిలర్‌కు రూ 18,000, సోషల్ వర్కర్లకు రూ.18,000, అవుట్ రీచ్ వర్కర్లకు రూ.12,000 డీఓకు , అకౌంటెంట్, డీఏకు రూ.14,000 వేతనం ఇస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



కొన్ని సంవత్సరాలుగా రెగ్యులరైజ్ కోసం ఆందోళనలు చేస్తున్నాం. సంబంధిత శాఖ మంత్రికి సమస్యను యూనియన్ నాయకులు వివరించారు. మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న తమ రెగ్యులరైజేషన్ ఫైళ్లు క్లియర్ చేయాలి. ఆ విభాగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలి.

– బానోత్ వీరన్న, సీపీఓ(ఐసీ)

హామీ ఇచ్చారు..

చైల్డ్ ప్రొటెక్షన్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఆందోళనలు చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలు ఆందోళనలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో మంత్రులను కలిసి విన్నవించుకోగా ఎట్టకేలకు వారు కనికరించి రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని నాయకులు చెబుతున్నారు. పర్మినెంట్, పీఎఫ్, ఈఎస్ఐ, హెచ్ఆర్ఏ, పేస్కేలు అమలు చేయాలని ప్రధాన డిమాండ్‌లతో ఆందోళనలు చేస్తున్నారు.

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి



మరిపెడ రూరల్: ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కిషన్‌నాయక్

మరిపెడ రూరల్: ఎస్సీ, ఎస్టీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయడతోపాటు గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చయ్య, అడ్వకేట్ కొప్పుల రమేష్ పాల్గొన్నారు.

రాంచంద్రునాయక్‌తోనే అభివృద్ధి

చిన్నగూడూరు: డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని మండల వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాడు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను అర్హులైన ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని సూచించాడు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన జమ్ముల దిలీప్, సంద మనోజ్ అనే ఇద్దరు వ్యక్తులపై అజ్మీరా ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి మంగళవారం రాత్రి తెలిపాడు. న్యాయవాది సంద కృష్ణతో కలిసి అజ్మీరా ప్రవీణ్ డ్రైవర్‌గా వస్తుండగా దిలీప్, మనోజ్ కంబాలపల్లి గ్రామంలో కారుకు అడ్డం తిరిగి ఘర్షణ పెట్టుకున్నారు. ప్రవీణ్‌ను కులంపేరుతో దూషించగా అతడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

ఖబ్రస్తాన్ సందర్శించిన ఎమ్మెల్యే



మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యే మురళీనాయక్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

మహబూబాబాద్ రూరల్: వక్ఫ్ బోర్డు భూముల రక్షణ పర్యవేక్షణలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పట్టణంలోని పాత బజారులో గల జామియా మసీదు, ఉమర్ ఫారూఖ్ మసీదు, ఖబ్రస్తాన్ ప్రాంతాలను మంగళవారం సందర్శించాడు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మజీద్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎండి ఖలీల్, జనరల్ సెక్రటరీ ఎండి.జాకీర్ హుస్సేన్, ట్రెజరర్ ఎంఏ.హకీం, ఇమామ్ ముఫ్తీ ఆలంగీర్, యాకూబ్ పాషా, అన్వర్ సాబ్, నజీర్, గౌస్, రఫీక్, జావీద్, నదీమ్ ఖాన్, ఖబ్రస్తాన్ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌ను మహబూబాబాద్ మున్సిపాలిటీ 34వ వార్డు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎండి.హరుణ్, నరసింహారావు, వేణుగోపాల్, శ్రీనివాస్, వెంకన్న, కామేశ్వర్ రావు, వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం

ఎమ్మెల్యే మురళీనాయక్, ఉమ దంపతులను మహబూబాబాద్ వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కపుల్స్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ మాలె యోగేశ్వర రావు, క్లబ్ అధ్యక్షుడు ఈగ శ్రీనివాస్, కార్యదర్శి జంగాల సదాశివుడు, ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్లు బొల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్ అర్బన్: మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ అన్నారు. మానుకోట జిల్లా కొత్తగూడంలో మంగళవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల పదోన్నతులకు అడ్డుగా ఉన్న జీఓ నంబర్ 2ను రద్దు చేయాలన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్పెషల్ డీఎస్సీ 2002 ఉపాధ్యాయులకు సంబంధించిన అప్రెంటిస్ పిరియడ్‌కు సంబంధించిన నాలుగు నెలల వేతనాలు చెల్లించాలన్నారు. మంత్రి సీతక్క ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలను సీఎం, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్యల వీరస్వామి, బోడ దేవేందర్, రామచందర్, విజయ్ కుమార్, సాయిలు, నరసయ్య, సారంగపాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతి

మహబూబాబాద్ అర్బన్: ఎమ్మెల్యే మురళీనాయక్‌ను టీపీటీఎఫ్ నాయకులు మార్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, ఉపాధ్యక్షుడు మలాష్టి రమేష్, జిల్లా కార్యదర్శులు సోమ విష్ణువర్ధన్, చీకటి ఉపేందర్, విద్యాసాగర్, శ్రీనివాస్, విజయరాజ్, వసంత, ప్రభాకర్, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి వినతి

బయ్యారం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని టీఎస్ టీటీఎఫ్ నాయకులు కోరారు. సోమవారం ఖమ్మంలో మంత్రిని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భద్రునాయక్ కలిశారు.

గ్రామసభల నిర్వహణపై అవగాహన



గార్ల: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రవీందర్

గార్ల: ఈనెల 28 నుంచి ప్రభుత్వం నిర్వహించే ప్రజాపాలన గ్రామసభల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రవీందర్ అవగాహన కల్పించారు. గ్రామసభల నిర్వహణకు ఒక రోజు ముందు గ్రామాల్లో చాటింపు వేయించాలని, గ్రామసభలో ఆరు గ్యారంటీల పథకాలకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుల దరఖాస్తుల స్వీకరణ కోసం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 28నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. గ్రామసభల్లో ప్రతీరోజు వచ్చే దరఖాస్తులను అదే రోజు సాయంత్రం అప్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.స్వాతిబిందు, పీహెచ్‌సీ డాక్టర్ జి.రవి, డీటీ సుధాకర్, ఎంఈఓ రజిని, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: త్వరలో ప్రభుత్వం నిర్వహించే గ్రామసభలపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎంపీఓ అప్సర్‌పాషా మంగళవారం తెలిపాడు.

మంత్రి 'పొంగులేటి'కి ఘనస్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మరిపెడ మీదుగా వరంగల్ వెళ్తున్న క్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ ఆయనకు ఘనస్వాగతం పలికారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం ముందు ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, గంధసిరి అంబరీష, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఆర్థికంగా సహకరించాలి.

మత్స్యకారులకు ఆర్థికంగా సహకరించాలని కోరుతూ డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ వినతిపత్రం అందజేశాడు. ఈ ఏడాది ఆగస్టు నెలలో కురిసిన వర్షాలకు ఆర్థికంగా నష్టపోయామని మత్స్యపారిశ్రామిక సహకార సంఘానికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నాడు. ఆయనతో పాటు వెంకటేశ్వర్లు, తమ్మనబోయిన లక్ష్మణ్, సుంకరి శ్రీను తదితరులున్నారు.

సీపీఐ ప్రజాపోరాటానికి 99ఏళ్లు

ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు



నెహ్రూసెంటర్: జెండా ఎగురవేస్తున్న విజయసారథి



మరిపెడ: జెండా ఎగురవేస్తున్న బాలకృష్ణ



దోర్నకల్‌లో..



కురవిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు



గార్ల: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కేసముద్రంలో..

నెహ్రూసెంటర్: పోరాటాలే ఎజెండాగా, ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ నిర్వహిస్తున్న ప్రజాపోరాటాలకు 99 ఏళ్లు అని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మంగళవారం పార్టీ 99వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, కట్లోజు పాండురంగాచారి, తండ సందీప్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

దోర్నకల్: స్థానిక రెండో మెయిన్ రోడ్డులో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెల్యూరి నాగేశ్వర్ రావు పార్టీ జెండాను ఆవిష్కరించాడు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ తురక రమేష్, నాయకులు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మరిపెడ: మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ముందు పార్టీ జెండాను మండల అధ్యక్షుడు మారగాని బాలకృష్ణ ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు అబ్దుల్ రషీద్, నాయకులు మల్లెపాక యాకన్న, పోలేపంగు వెంకన్న, నారాయణ, చందు, వీరన్న పాల్గొన్నారు.

గార్ల: గార్ల నెహ్రూసెంటర్‌లో, సీపీఐ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు కట్టిబోయిన శ్రీనివాసరావు, మండల కార్యదర్శి జంపాల వెంకన్న, పోతుల నర్సింహరావు, రాగం రమేష్, జనార్దన్, కృష్ణమూర్తి, రమేష్, పిచ్చయ్య పాల్గొన్నారు.

కురవి: పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తున్నదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, నాయకులు సమ్మయ్య, రమేష్, వెంకన్న, సారయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని ధర్మన్న భవన్ ఎదుట మండల కార్యదర్శి చొప్పరి శేఖర్ పార్టీ జెండా ఆవిష్కరించాడు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్, ఉపేందర్, కాసు సాయిచరణ్, మంద శ్రీను, యాకయ్య, రాజేందర్, శ్రీను పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు అభిషేక పీఠం సంప్రోక్షణ పూజలు

మహబూబాబాద్ రూరల్: గోదారంగనాథులు, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి నూతన విగ్రహాల అభిషేక పీఠం సంప్రోక్షణ పూజలు బుధవారం నిర్వహిస్తున్నామని శ్రీరామ ఆలయ ప్రధాన అర్చకుడు ఎంవీ.కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపాడు.

అన్నదానం

కేసముద్రం: శ్రీదత్త జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో దత్తభక్తుల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై కృష్ణమూర్తి, హెడ్ కానిస్టేబుల్ రాఘవులు, విజయభాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఉప్పుల ఏకాంతం, లింగమూర్తి, కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

పరామర్శ

కురవి: మండల కేంద్రంలో వార్డు సభ్యుడు ఆమెడ మల్లికార్జున్ తండ్రి వెంకటయ్య ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు గుగులోత్ రవినాయక్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యుడు బేతమల్ల సహదేవ్, జిల్లా కమిటీ సభ్యుడు అనుగోజు పూర్ణచందర్‌రావు, మండల నాయకుడు పెద్దబోయిన శ్రీశైలం యాదవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అయ్యప్పస్వామి పూజలు

గూడూరు: అయ్యప్పస్వామి మాలధారుల పూజలలో భాగంగా మంగళవారం మండలంలోని కోబల్ తండాలో నాగరాజు కన్నెస్వామి గృహంలో అయ్యప్పస్వామి శరణుఘోష, భజనలు మార్మోగాయి. గురుస్వామి నరేష్‌శాస్త్రి గణపతి, కుమారస్వామి, అయ్యప్పస్వామి అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం అయ్యప్పస్వామి విగ్రహానికి పంచామృత అభిషేకాలు చేశారు. గురుస్వాములు బాలూస్వామి, భిక్షుస్వామి, రంజిత్, దోసపాటి శ్రీనివాస్‌గౌడ్, హంసావత్ శ్రీనివాస్‌నాయక్, నారాయణస్వామి పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన రాధమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు మంగళవారం బాధిత కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను అంజేశాడు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, బాలకృష్ణారెడ్డి, భూలోకరెడ్డి, ఉపేందర్, మంజుల , తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

దంతాలపల్లి: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మండలంలోని వాల్యతండా గ్రామపంచాయతీలో మంగళవారం అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

విజయ్ సేవలు మరువలేనివి

నెహ్రూసెంటర్: సీపీఐ జిల్లా సమితి సభ్యులు తోట విజయ్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. తోట విజయ్ రెండో వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తోట విజయ్ సతీమణి తోట రాజకుమారి, తోట రమేష్, నాయకులు పెరుగు కుమార్, నవీన్, సందీప్, వెంకన్న, శ్రావణ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సహకరించాలి

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునే అర్హులైన లబ్ధిదారులకు కాంగ్రెస్ కార్యకర్తలు సహకరించాలని పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28 నుంచి వచ్చే నెల 6 వరకు గ్యారంటీల కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు అధికారులు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శ్రీరామ అక్షింతలు అందరికి చేరాలి



మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని ప్రతి గృహానికి శ్రీరామ అక్షింతలు చేరే విధంగా దీక్ష తీసుకుని అందరం పనిచేద్దామని విశ్వహిందూ పరిషత్ బాధ్యుడు కృష్ణమోహన్ అన్నారు. శ్రీరామచంద్రుల దివ్యధామం నుంచి పంపిన పూజ అక్షింతలు మహబూబాబాద్ పట్టణానికి చేరుకోగా మహేశ్వరీ భవనంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, శ్యాంసుందర్ శర్మ, కర్లపాటి నారాయణమూర్తి, లక్ష్మణ్, మాలే నాగేశ్వరరావు, అశోక్, శివ, శ్రీనివాస్, రానా, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

కేసముద్రం: మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్త అయ్యప్ప దేవాలయంలో నాగనబోయిన సునీత, వెంకటేశ్వర్లు దంపతులు అయ్యప్పస్వాములకు మంగళవారం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన తాంత్రి బ్రహ్మశ్రీ విష్ణు నారాయణ, గురుస్వాములు ఓలం చంద్రశేఖర్, పోలెపల్లి యాకూబ్‌రెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, ఎల్లాగౌడ్, కూరెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నుంచి ఎంపీ టికెట్ ఆశిస్తున్నా'



మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ నుంచి మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా టికెట్ ఆశిస్తున్నానని వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరి జెడ్పీటీసీ, మాజీ డిప్యూటీ తహసీల్దార్ బానోత్ సింగ్ లాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ తల్లి సోనియాగాంధీ, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రజా సేవ కోసం కాంగ్రెస్ పార్టీలో చేరానని, ప్రజలు తనను ఆదరించాలని కోరారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. సమావేశంలో గుండా మధురెడ్డి, రాజు పాల్గొన్నారు.